

వేములవాడ డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌లో మాట్లాడుతున్న సాధారణ పరిశీలకుడు డాక్టర్ జగదీష్ సాన్‌కర్


పోలీస్ అధికారులతో మాట్లాడుతున్న ఎన్నికల పోలీస్ పరిశీలకురాలు వినీత సాహు

# పారదర్శకంగా పోలింగ్ చేపట్టాలి

- ఎన్నికల సాధారణ పరిశీలకుడు డాక్టర్ జగదీష్ సాన్‌కర్
- ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రాల పరిశీలన
- పాల్గొన్న అధికారులు


వేములవాడ డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌ను పరిశీలిస్తున్న ఎస్పీ అఖిల్ మహాజన్


ఎన్నికల విధులకు తరలి వెళ్తున్న సిబ్బంది


సెల్ఫీ దిగుతున్న ఉద్యోగులు

వేములవాడ, నవంబర్ 29: ఎన్నికల నిబంధనల మేరకు పారదర్శకంగా ఎన్నికల పోలింగ్ జరిగేలా చూడాల్సిన బాధ్యత పోలింగ్ సిబ్బందిదేనని ఎన్నికల సాధారణ పరిశీలకుడు డాక్టర్ జగదీష్ సాన్‌కర్ అన్నారు. బుధవారం వేములవాడ నియోజకవర్గానికి సంబంధించి వేములవాడ ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఎన్నికల సాధారణ పరిశీలకుడు డాక్టర్ జగదీష్ సాన్‌కర్, పోలీస్ పరిశీలకురాలు వినీత సాహు, ఎన్నికల వ్యయ పరిశీలకుడు జీ మణిగండసామి ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా డాక్టర్ జగదీష్ సాన్‌కర్ మాట్లాడారు. కేంద్ర ఎన్నికల సంఘం నిబంధనల మేరకు పోలింగ్‌ను నిర్వహించాలని చెప్పారు. ఉదయం 5 గంటలకే మాక్ పోలింగ్ చేపట్టాలని సూచించారు. ఉదయం 7 గంటలకు వాస్తవ పోలింగ్ ప్రారంభించాలని చెప్పారు. ప్రతి రెండు గంటలకు ఒకసారి పోలింగ్ శాతాన్ని నివేదించాలని సిబ్బందిని ఆదేశించారు. ఈవీఎంలలో ఏమైనా సాంకేతిక సమస్యలు తలెత్తితే సెక్టార్ అధికారులు, రిటర్నింగ్ అధికారులకు నివేదించాలని చెప్పారు. పోలింగ్ ముగిసిన అనంతరం నిబంధనల మేరకు సీల్ వేసి రిసెప్షన్ కేంద్రాల్లో అప్పగించాలని చెప్పారు. కార్యక్రమంలో వేములవాడ రిటర్నింగ్ అధికారి మధుసూదన్, అదనపు ఎస్పీ చంద్రయ్య, డీఎస్పీ నాగేంద్రాచారి, సీఐలు కరుణాకర్, కృష్ణకుమార్ తదితరులు ఉన్నారు.


డిస్ట్రిబ్యూషన్ సెంటర్ వద్ద సెల్ఫీ దిగుతున్న సిబ్బంది


ఎన్నికల విధులకు బస్సులో తరలి వెళ్తున్న సిబ్బంది



ఎన్నికల విధులకు సిద్ధంగా ఉన్న ఆర్టీసీ బస్సు

# ప్రజలే నా బలం.. బలగం

- చివరి శ్వాస వరకు ప్రజా సేవ చేస్తా
- చావునోట్ల తలపెట్టి తెలంగాణను సాధించిన నాయకుడు కేసీఆర్
- చొప్పదండి బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే రవిశంకర్
- దీక్షా దివస్ సందర్భంగా బీఆర్ఎస్ జెండా ఎగురవేసిన ఎమ్మెల్యే


మధురానగర్‌లో మాట్లాడుతున్న చొప్పదండి బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే రవిశంకర్

గంగాధర, నవంబర్ 29: 'ప్రజలే నా బలం.. బలగం. చొప్పదండి నియోజకవర్గ ప్రజలు ఓటేసి గెలిపిస్తే చివరి శ్వాస వరకు ప్రజా సేవ చేస్తా. చావు నోట్లో తలపెట్టి ప్రత్యేక తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన సీఎం కేసీఆర్ మూడోసారి ముఖ్యమంత్రి పీఠాన్ని అధిరోహిస్తారు' అని చొప్పదండి బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే రవిశంకర్ పేర్కొన్నారు. బుధవారం దీక్షా దివస్ సందర్భంగా మండలంలోని బూరుగుపల్లిలో బీఆర్ఎస్ జెండాను ఎమ్మెల్యే ఎగురవేశారు. అనంతరం మధురానగర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ ప్రజలంతా కేసీఆర్ వెంటే ఉన్నారని ధీమా వ్యక్తం చేశారు. స్థానిక బిడ్డనైన తాను నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసినట్లు తెలిపారు. స్థానికేతరులను గెలిపిస్తే అభివృద్ధి కుంటుపడుతుందని పేర్కొన్నారు. కాంగ్రెస్ ఆరు గ్యారంటీలకు వారంటీ లేదని, 60 ఏండ్లు రాష్ట్రాన్ని పాలించిన కాంగ్రెస్ ప్రజలకు చేసిందేమీలేదన్నారు. తెలంగాణలో అమలవుతున్న సంక్షేమ పథకాలు కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. ఎన్నికల సందర్భంగా బీఆర్ఎస్ ప్రకటించిన మ్యానిఫెస్టోను తప్పకుండా అమలు చేసి తీరుతామన్నారు. స్థానికంగా ఉంటూ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసిన తనను మళ్లీ గెలిపిస్తే మరింత అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. సమావేశంలో గంగాధర, కురిక్యాల సింగిల్ విండో చైర్మన్లు దూలం బాలగౌడ్, వెలిచాల తిర్మల్‌రావు, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు మేచినేని నవీన్‌రావు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సాగి మహిపాల్‌రావు, సర్పంచులు వేముల అంజి లావణ్య, వేముల దామోదర్, నాయకులు అట్ల శేఖర్‌రెడ్డి, దూలం శంకర్‌గౌడ్, తోట నాంపెల్లి, గడ్డం స్వామి, వాసాల గంగాధర్, మడ్లపెల్లి రమేశ్, నల్ల నరోత్తంరెడ్డి, తూము తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాలకు చేరిన పోలింగ్ సిబ్బంది

వేములవాడ రూరల్, నవంబర్ 29 : వేములవాడ, వేములవాడ రూరల్ మండలంలోని పోలింగ్ సిబ్బంది గ్రామాలకు చేరుకున్నారు. గురువారం ఎన్నికలు జరుగనున్న గ్రామాల్లో పోలింగ్ కేంద్రాలకు చేరుకుని పోలింగ్‌కు సంబంధించిన ఏర్పాట్లు చేసుకున్నారు. గ్రామాల్లో పోలింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్ ఉన్నట్లు పోలీస్ అధికారులు పేర్కొన్నారు. ఉదయం 7 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ జరుగనున్నట్లు ఆధికారులు వెల్లడించారు. ఓటర్లు తప్పనిసరిగా తమ వెంట ఏదేని గుర్తింపుకార్డు తీసుకెళ్లాలని సూచించారు. సాయంత్రం 5 గంటల వరకు క్యూలో ఉన్న వారికి పోలింగ్ వేసేందుకు అవకాశం ఉన్నట్లు ఎన్నికల అధికారులు వెల్లడించారు. సమస్యాత్మక ప్రాంతాల్లో అదనపు కేంద్ర బలగాలను పంపిస్తున్నట్లు డీఎస్పీ నాగేంద్రచారి తెలిపారు. ఎన్నికల ప్రశాంతంగా జరిగేందుకు ప్రతి ఒక్కరూసహకరించాలని కోరారు.

## పోలింగ్ కేంద్రాలకు చేరిన అధికారులు

కోనరావుపేట, నవంబర్ 29: వేములవాడ అసెంబ్లీ నియోజకవర్గ ఎన్నికల్లో భాగంగా ఎన్నికల అధికారులు సామగ్రితో పోలింగ్ కేంద్రాలకు చేరారు. వేములవాడ పట్టణంలోని జూనియర్ కళాశాల మైదానం నుంచి ఆయా గ్రామాలకు చెందిన పోలింగ్ సిబ్బంది పోలింగ్ సామగ్రితో బస్సులో చేరుకున్నారు.